దాదాపు అరగంట సేపట్నుంచీ - ప్రార్థించగా, ప్రార్థించగా ఇప్పటికి కరుణించి నట్లున్నారు.

ఫలితంగా మేము ప్రయాణిస్తున్న బస్సు ఆగింది. ఇంతకుముందు కూడా చాలాచోట్ల ఆగింది. కానీ మేము దిగాల్సిన చోట ఆగింది ప్రస్తుతం-

"రారా సూర్యం ఇక్కడే మనం దిగాల్సింది." మరోమాటు చెబుతూ తాను ముందు దిగాడు చంద్ర...బస్సులో జనం క్రిక్కిరిసి పోయారు. బాగా వత్తిడిగా వుంది. అందరినీ నెట్టుకుంటూ మెల్లగా బయట పడ్డాను...

హాయిగా వున్నట్లు అనిపించింది. నరకంలో నుంచి బయటపడ్డ అనుభూతి కలిగింది నిజం చెప్పాలంటే.

"ఇవేం బస్సులో బాబు...మా వూళ్ళో ప్రైవేటు బస్సులే నయం..." చంద్ర చేతిని పట్టుకుంటూ నా అభిప్రాయం వెలిబుచ్చాను.

"ఇది మీ వూరు కాదు మతి" అన్నాడు చంద్ర ఎగతాళిగా- "ఇక్కడ్నుంచి కొద్ది దూరం నడవాలి మనం-దిక్కులు చూడకు. నా పక్క నేరా."

మళ్ళీ నాకు జాగ్రత్తలు చెప్పటం మొదలెట్టాడు, వెధవ-అనుకున్నాను మనసులో. నేనేం చిన్న పిల్లాడినా ?

ఆలోచిస్తే ఈ హైదరాబాదు కన్నా మా వూరే అన్ని విధాలా వుత్తమంగా కనిపిస్తోంది. చంద్ర కూడా హైదరాబాదు వచ్చిం తరువాత చాలా మారిపోయాడు-దాని పేరు



# పడ్డివాళ్ళు

పామర్తి రాజేంద్రప్రసాద్

లక్డీకాపూల్ అట! అక్కడ బస్సెక్కాము. కూర్చోవటం సంగతి తరవాత. అసలు నిలబడటానికే దిక్కులేదు. హైదరాబాదు బస్సులు హాయిగా వుంటా యనుకున్నాను కానీ-ఇంత అన్యాయంగా వుంటా యనుకోలేదు. మగవాళ్ళు ఎట్లాగో సర్దుకోవచ్చు... ఆడవాళ్ళు-అందులోనూ చదువుకునే అమ్మాయిలు ఇబ్బందిగా నిలబడివుంటే ఒక్క మగరాయుడూ లేచి నిలబడి- తన చోటులో కూర్చోమని చెప్పడే...? నిలబడి వున్న పోజుగాళ్ళు మాత్రం..వాళ్ళకొక్క స్త ఎడంగా నిలబడ నక్కర్లా?...వాళ్ళ పక్కకు వెళ్ళి

అనుకుంటారేం? వాళ్ళను కావాలని రాసుకుంటూ పోతారు!!... అంత అసభ్యంగా ప్రవర్తిస్తున్నా బస్సులో ఒక్క గాడిదయినా అదేమని మందలించదు!.

అసలు నేనే ఆ పని చేద్దామనుకున్నా... "నీకేం తెలీదు ... నోరు మూసుకో..." అన్నాడు చంద్ర. ఏమిటో నాకు తెలియనిదీ వీడికి తెలిసిందీ?-'హరి భగవంతుడా ఏమిటీ అన్యాయం?' అనుకున్నాను ఇంకేమీ చేయలేక.

అయినా వీడు మాత్రం అట్లా గుడ్లు అప్పచెప్పి చూస్తాడే-తనకేమీ పట్టనట్లు! కాస్త కలుగచేసుకోవద్దూ... పైగా నన్ను వారిస్తాడా?-

"నీ పద్ధతి నాకేం నచ్చలేదు చంద్రా.." వాడి పక్కన నడుస్తూనే అన్నాను, ఆలోచనలు మాని.

"ఏమిటి నచ్చలేదు?"

ఎదురు ప్రశ్న!

ఇదివరకు వాడు మా వూళ్ళో వున్నపుడు నేనట్లా కోపంగా మాట్లాడితే నోరు కదిపేవాడూ?

"ఏమీ నచ్చలేదు. ఒకటి నచ్చింది కనుకనా, మరోటి నచ్చకపోవడానికి!...... ఏయ్ తలతిప్పు నన్ను దిక్కులు చూడొద్దని నువ్వు చూస్తావేం?..."

"అదే...ఆ అమ్మాయిని ... బావుంది కదూ" అంటూ ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి కేసి చూస్తూ చప్పరించటం మొదలెట్టాడు. వోరి పక్షీ...తిప్పుతల. చూడవచ్చా అట్లా? నాశనమై పోతావురా...తినేసేటట్లు ఏమిటా చూపులు?... అక్కచెల్లెళ్ళు లేరూ నీకు? "వుంటే - ఇంక ఆడాళ్ళవైపు కన్నెత్తి చూడొద్దంటావా ఏం రా...నీకు వుడుకు రక్తం లేదు...అంతా ఎర్రటి ఐస్ నీళ్ళు... అదిగో చూడు మనిద్దరినీ చూస్తోంది... నిన్ను ప్రత్యేకంగా చూస్తోంది సంతోషించు!

"ఛత్...నీ వెధవ మాటలు విని వెనక్కు తిరిగింది. ఏమనుకుంటుందో ఏమో?" పాడయిపోయావురా నువ్వు! నా స్నేహితుడివని చెప్పుకోడానికి సిగ్గుగా వుంది."

"పోనీ చెప్పుకోకు." అంటూ నవ్వాడు.

మండిపోయిందినాకు—ఎట్లా నవ్వాడో!

కొంత దూరం నడిచిన తరువాత అడిగాను "ఇంకా ఎంత దూరం నాయనా ?..." అని.

"వచ్చేశాం దగ్గరకి."

రెండు మూడు మలుపులు తిరిగాము. ఇందాకటి రద్దీ లేదు ఆ రోడులో ...జనం పలుచగానే వున్నారు... మాకు ఎదురుగా వస్తున్న ఇద్దరు అమ్మాయిల్ని చూడగానే ఠక్కున ఆగిపోయాన్నేను!... వాళ్ళిద్దరికీ మోకాళ్ళవరకూ గుడ్డలేదు.!! అరలంగాలు వేసుకున్నారు! వాటిని 'స్కరు' అంటారట... భుజాలు లేకుండా వంటికి అతుక్కుపోయే జాకెట్లు—అసభ్యంగా వున్నాయి జుట్టు పొట్టిగా కత్తిరించి వుంది. పెదవులకు రంగు పూసినట్లున్నారు—గులాబీ రెబ్బలకు రక్తం పూసినట్లు వున్నాయి. వాళ్ళను అట్లా చూస్తూంటే నాకే సిగ్గు వేసింది. వాళ్ళకెట్లా బుద్ధి లేదో మరి?

చంద్ర నాచేయి పట్టుకొని గట్టిగా నొక్కుతూ నవ్వాడు.

వాడ్ని కోపంగా చూస్తూ మామూలుగా నడవటం మొదలెట్టాను...అట్లా నాలుగడుగులు వేశానో లేదో మళ్ళీ ఆగిపోయాను "సడన్ బ్రేకు" వేసినట్లు !

రెండు జడల పిల్ల—అవతలి వైపునుంచి వస్తోంది.

పక్కన కిళ్ళీ షాపు దగ్గర నిలబడ్డారు ఇద్దరు కుర్రాళ్ళు. బక్కపలుచగా ఆరడుగుల పొడుగున వున్నారు. ఆ పోజురాయుళ్ళలో ఒకడు ఈల వేసుకుంటూ ఆ అమ్మాయికి ఎదురు వెళ్ళాడు...

''హాయ్ బాబీ...,'' అన్నాడు !

అంతటితో వూరుకుంటే ఫరవాలేదు. ఆ అమ్మాయి జబ్బ పట్టుకొని గుంజాడు ! మామూలుగా ఏమీ ఎరగనట్లు నడుస్తూ వెళ్ళి పోయాడు, పక్కవాడితో పాటు !

ఆ పిల్ల గిరుక్కున వెను దిరిగి చూసింది.

వాళ్ళు మరో అమ్మాయి వెంట పడారు !

అంతా క్షణం సేపట్లో జరిగి పోయింది !

వాడిని నరికేద్దామన్నంత కోపం వచ్చింది నాకు...

ముందుకు వెళ్ళబోతున్న నన్ను చంద్ర గట్టిగా పట్టుకొని ఆపాడు !......''ఇది మీ వూరు కాదు !'' అన్నాడు కర్కశంగా.

నేను అసహాయుణ్ణయాను.

చుట్టూరా పరికించి చూశాను...

ఎవరి దోవన వాళ్ళు వెళుతున్నారు !... ఏమీ ఎరగనట్లు పిల్లి కూనల్లాగా నడిచి పోతున్నారు !

భీముడిలా వున్నాడు ఒకడు—కండలు తిరిగిన శరీరంతో. వాడు చూశాడు ఆ దృశ్యాన్ని. కానీ తలవంచుకొని వెళ్ళిపోయాడు!

సినిమా హీరోలా వున్నాడు. ఇంకొకడు క్రాపును రింగులు రింగులుగా తిప్పి ఆత్రంగా వెళుతున్నాడు, ఎక్కడో కొంపలు అంటుకున్నట్లు—ఇక్కడ ఏమీ జరగనట్లు... !

అరవయ్యేళ్ళ ముసలాయన—పెద్దమనిషి తరహాలో మావూరి కరణంలా వున్నాడు. ఆయనన్నా వాణ్ని కొద్దిగా మందలిస్తాడేమో అనుకున్నాను.... కళ్ళద్దాలు తీసి, తుడుచుకుంటూ వెళుతున్నాడు తాపీగా—తనకు సంబంధం లేనట్లు.

మొత్తానికి ఎవరూ పట్టించుకోలేదు. చివరకు ఆఅమ్మాయికూడా! అంత అవమానం జరిగినా—ఏమీ కానట్లే చక్కగా నడిచిపోతుంది ! ''కానీ మనసులో ఎంతగా బాధ పడ్డదో ?...ఆ బాధ బయటికి కన్పించనీయకూడదు కాబోలు ! '' బయట పడ్డందు వల్ల ఏమిటి ప్రయోజనం ?...ఎవడు పట్టించుకునేది ?...ఇదే మావూళ్ళో అయితేనా—పది మందీ పోగయి వాణ్ని చితగ్గొట్టేవాళ్ళు ! అక్కడే పాతిపెట్టేవాళ్ళు ! కాని...కానీ... ఇది హైదరాబాదు.

''ఊఁ... త్వరగా నడూ సూర్యం... వెళ్ళాలి...''

తొందర చేశాడు చంద్ర.

కాళ్ళు కదిల్చాను—నేనూ, ఏమీ ఎరగనట్లే...ఏమీ జరగనట్లే...... !

హైదరాబాదు చూడాలనేది చిన్నప్పటి నుంచీ నాలో పాతుకు పోయిన పెద్ద కోరిక ''ఎన్నాళ్ళో ఈ మహానగరాన్ని చూడాలని తహ తహ లాడాను...చూశాను కోరిక తీరి పోయింది ! దీని గొప్పతనం అర్థమైంది !

ఇక్కడి మనుషులు ఎట్లాంటి వాళ్ళో వూహించ గలిగాను—

నెల రోజులు వుండాలని వచ్చి వాణ్ని ఆ మర్నాడే మావూరికి ప్రయాణం అయ్యాను !

అప్పట్నుంచి నాకు హైదరాదు వెళ్ళడమంటే పరమ అసహ్యం ! *